

వివరాలు మెయిన్‌లో

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 02 అక్టోబరు , 2026 | పేజీలు : 6





వివరాలు మెయిన్‌లో...




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం),టిజెఎస్,సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన

సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని కోరుతూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

### ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు

# సహాయక చర్యల్లో యువత ముందుండాలి

### జిల్లా స్థానిక అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను రక్షించేందుకు యువత ముందువరుసలో ఉండాలని, విపత్తులపై పూర్తి అవగాహనతో సిద్ధంగా ఉండాలని జిల్లా స్థానిక అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం ఆక్షన్‌ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ కళాశాలలో ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రకృతి విపత్తుల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరదలు, భూకంపాలు, తుఫానులు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తులు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సంభవిస్తున్నాయని తెలిపారు. విపత్తుల కారణంగా ప్రాణ, పంట, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో తోటివారిని కాపాడేందుకు యువత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ దిశగా ఆక్షన్‌ఎయిడ్ సంస్థ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా ఫైర్ డిపార్ట్మెంట్ అధికారి మధుసూదన్ రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల కారణంగా చెట్లు, నివాస ప్రాంతాలు దగ్ధం కావడంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రాణ నష్టం కూడా సంభవిస్తుందని తెలిపారు. అగ్ని ప్రమాదాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అగ్నిమాపక శాఖ నిరంతరం సేవలందిస్తోందని, అదే సమయంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. భువనగిరి ఫైర్ స్టేషన్ అధికారి మధుకర్ అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ విజయ్ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ నిర్వహించే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఆక్షన్‌ఎయిడ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఇర్ఫాన్ సమన్వయం చేయగా, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రారంభ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం, సిటిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగారం శంకర్, పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ సభ్యులు భానోతు భాస్కర్ నాయక్, దేశపాండ్య భారత్, ఎల్ఆర్పీ ప్రతినిధులు జే. కవిత, టి. చంద్రకళ, జి. శోభారాణి, టి. శిరీష, మమత, కళాశాల అధ్యాపకులు, ఫైర్ సిబ్బంది తదితరులతో పాటు సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.





## చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రజా ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహయ నిధి ఎంతో అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దాచారం శ్రీరాంనగర్‌కు చెందిన అలుగుబెల్లి సావిత్రమ్మ, కొండేటి మాధవరెడ్డి లకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇరువురికి 60వేల రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పేర్వాల రంగారెడ్డి, కొండేటి అరవింద్‌రెడ్డి, కోట వీరస్వామి పాల్గొన్నారు.

## వరి పురుగుల నియంత్రణపై అవగాహన



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కాండం తొలిచే పురుగు వల్ల గుండె ఎండిపోవడం, తెల్లటి కంకులు ఏర్పడటం, ఆకుముడత పురుగు వల్ల ఆకులు ముడుచుకుని పచ్చని భాగాన్ని తినడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఏలూరులోని సెయింట్ థెరిస్సా కళాశాలకు చెందిన బిఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు రైతులకు వివరించారు. గురువారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో వరి పంటలో పురుగుల నియంత్రణపై ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు వై.మనీషా, హేమలత, మౌనిక, నవ్యశ్రీ, సౌమ్య, సత్యజ్యోతి, రైతులు రామలింగయ్య, గురుస్వామి, ఎల్లావుల గోపాల్‌రావు, చంద్రమ్మ, గూడెపు శ్రీనివాస్, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని గ్రామ సర్పంచ్ జూనబోయిన గురవయ్య పంపిణీ చేశారు. గురువారం మండలంలోని రేవూరు గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, నాడు కంటి తుడుపు చర్యగా వ్యవహరించారే తప్ప అర్హులైన ఒక్కరికి కూడా కొత్తరేషన్‌కార్డులు పంపిణీ చేయలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలకు నూతన రేషన్‌కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేయడం దేశంలోనే ఏ ఒక్క రాష్ట్రంలో లేదని, మన తెలంగాణలోనే ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## పాలకవీడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన కోదాడ డిఎస్పీ

**ప్రజాపక్షం/పాలకవీడు:** పోలీస్ వార్షిక తనిఖీల్లో భాగంగా కోదాడ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ కోటేష్ తన బృందంతో కలిసి అధికారికంగా స్వాగతం పలికారు. రెస్క్యూ, సామాగ్రి పరిశీలించిన డిఎస్‌పి స్థానికంగా ఉన్న గ్రామాల్లో సమస్యలపై ఆరాతీశారు. రికార్డు తనిఖీ చేసి గత మూడు సంవత్సరాలుగా ఇప్పటి వరకు ఉన్న క్రైమ్ రేట్‌పై క్షుణంగా సమీక్షించారు. ఎస్ఐ కోటేష్ పనితీరు బాగుందని అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మర్డర్, దొంగతనాలు తదితర కేసులు లేవన్నారు.

మహావీర్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడితే మహావీర్



పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 25వేలు ప్రోత్సహకం అందిస్తుందని డిఎస్‌పి స్పష్టం చేశారు. కేవలం ఆసుపత్రుల్లోనే కాకుండా కొన్ని ప్రైవేట్ హాస్పిటల్‌లో కూడా ఎమర్జెన్సీ యాక్సిడెంట్ లకు 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తాయని, సంబంధిత వివరాలు తహసిల్దార్, ఎస్ఐ ల దగ్గర ఉంటాయని తెలిపారు. ఎస్ఐ కోటేస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణ ప్రజలు, వాకర్స్ ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి ఉచిత మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని 17వ వార్డు కౌన్సిలర్, ఎన్వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి సూచించారు. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని జీజేసీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనయిత్రి ఫౌండేషన్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కామిశెట్టి సత్యనారాయణ సహకారంతో నిర్వహించిన ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో జీజేసీ గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం విశేషమని పేర్కొన్నారు. నిస్వార్థంగా సేవలు అందించిన వైద్యులు, ల్యాబ్ అసిస్టెంట్లు, మందులు పంపిణీ చేసిన దాతలు, వారి సిబ్బందిని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జానకిరామ్‌రెడ్డి, వెంకట్ రత్నం, కోశాధికారి చిన వెంకన్న, కార్యదర్శులు పులి శ్రీనివాస్ గౌడ్, నామ రత్నకుమార్, డైరెక్టర్లు సక్రాం నాయక్, కాసుల సత్యం, శ్రీను, సైదులు, మహేష్‌రెడ్డి, రాధి రాజేశ్వరి, అశోక్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవా లని కోరుతూ మాజీ హోంశాఖ మంత్రి కుందూరు జానారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేసినట్లు విజేత డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ తెలిపారు. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కళాశాలలో మాట్లాడారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ ఎంతో కష్టతరంగా మారిందని ఆందోళన చెందారు. యజమాన్యాలు తీవ్ర ఆర్థిక భారాన్ని మోస్తూ నడుపుతున్నాయని తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యను, కళాశాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని



నిధులు వెంటనే విడుదల అయ్యేలా ప్రభుత్వానికి విన్నవించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డిలను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చీదళ్ల యాదయ్య, మధుచారి, హరిప్రసాద్, దురయ్య, రాజారామ్, రాంరెడ్డి, సతీష్, బాలాజీ, సంతోష్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి పిఎసిఎస్ వైద్యురాలిపై సైకో దాడి అమానుషం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పోచంపల్లి పిఎసిఎస్ వైద్యురాలిపై సైకో దాడి అమానుషమని దుండగుడిపై చట్టపరమైనచర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులను బహిష్కరించారు.గురువారవారం పట్టణ కేంద్రంలోని మహమ్మాయమ్మ కాలనికి చెందిన దుద్యాల తిరిపతి అనే సైకో కాలుకు గాయం కావటంతో కట్టువేయించుకుందామని ప్రైమరీ ఆసుపత్రికి వచ్చారు.చార్జిపై ఉన్న జిబ్లక్ పల్లి పల్లే దవాఖాన డాక్టర్ శ్వేత అతనికి వైద్యం చేసి మందుబిళ్ళలు రాసి ఇచ్చి ఎలా వేసుకోవాలో చెప్పి పంపించారు. కోన్ని సెకన్‌ల వ్యవదిలోనే తిరిగి వచ్చి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ఆసుపత్రిలోని వస్తువులను ధ్వంసం చేసి వీరంగం సృష్టించి భయాందోళనకు గురిచేశాడు.అడ్డుకోబోయిన వారందరిని కూడా నానా బూతులు తిట్టాడు.వెంటనే వైద్య సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మానవీయ ఘటనను నిరసిస్తు సిబ్బంది విధులను బహిష్కరించారు.బాధితురాలుకు న్యాయం చేయాలని కోరారు.ఘటన జరిగిన రోజు మండల వైద్యాధిరారిణి డాక్టర్ శ్రీవాణి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేరే ప్రాంతంలో విధుల్లో ఉన్నారు.



## వ్యక్తిగత విమర్శలతో కాలం వెళ్లబుచ్చుతున్న సిఎం

**ప్రజాపక్షం/కోదాడ:** ఎన్నికలు పూర్తయి దాదాపు మూడేళ్లు గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇచ్చి హామీలలో తామేం చేశామో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో కెసిఆర్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం కోదాడలో తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తారేమోనని అక్కడి ప్రజలు ఎదురుచూశారని, వారికి నిరాశ ఎదురయిందని అన్నారు. ఇంకెంతకాలం వ్యక్తిగత విమర్శలతో కాలం వెల్లబుచ్చుతున్నారని అక్కడి ప్రజలే బహిరంగంగా విమర్శిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ కార్యచరణపై ముఖ్యమంత్రి సమాదానం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సిరిసిల్లలో ముఖ్యమంత్రి ప్రసంగంలో అభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన సమాధానాలు కనిపించలేదన్నారు. వ్యక్తిగత కక్షలు, కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తి చెప్పి, రాష్ట్రప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ఆయన హితవు పలికారు.

## బస్టాండ్ మరమ్మతులు పనులు ప్రారంభించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రంలోని బస్టాండ్ గత 26 సంవత్సరాలుగా శిధిలావస్థలో ఉంది. అటు జిల్లా కేంద్రానికి, ఇటు ఇతర రాష్టానికి వెళ్లే బస్సులు ఇక్కడ ఆగుతాయని, కాని ప్రయాణికుల కనీస అవసరాలైన తాగునీరు, టాయిలెట్, కూర్చునే కూర్చిలు, ప్రహరిగోడ, సిసిరోడ్డు, కలర్స్, లైటింగ్, సిసి కెమోరాల వంటి సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని గత కొన్ని నెలలుగా నిరసనలు, ధర్నాలు చేపట్టడంతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పికి, ఎంపిడివోలకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. గురువారం కోదాడ డిపో మేనేజర్ ను కలిసి బస్టాండ్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరగా, తక్షణమే స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో కొత్తపల్లి పవన్, పాలరపు సాయి, నాగార్జున, మధు, నాగరాజు, వెంకటేష్, సైదులు పాల్గొన్నారు.

## కెఎన్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటారు. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు హెటెరో ల్యాబ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ నియామక ప్రక్రియలో తొమ్మిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీలలో కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ నియామక ప్రక్రియలో అర్హత కలిగిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. హెటెరో ల్యాబ్స్ ప్రతినిధులు వంశీ మాధవ్, అజయ్ మొదటి రోజు రాత పరీక్ష, రెండవ రోజు ఇంటర్వ్యూ నిర్వహించి విద్యార్థుల నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలను పరిశీలించి ఎంపిక పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వివిధ సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ నియామకపు అధికారులు డాక్టర్ పి. రవీందర్, పి. నాగరాజు, అధ్యాపకులు ఎల్లయ్య, లింగరాజు, ప్రవీణ్ రెడ్డి, తోటి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## సైబర్ నేరాలపై అప్రమత్తత

ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ : సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ వీర శేఖర్ అన్నారు.గురువారం తిరుమలగిరి సాగర్ మండల కేంద్రం ప్రధాన సెంటర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వీరశేఖర్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేశ్యతండా గ్రామ పంచాయతీ సర్పంచ్ రమావత్ రాజునాయక్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా 2026 కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గ్రామ పంచాయతీ పాలక వర్గం, గ్రామ ప్రజలతో కలిసి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చిమొక్కలను పీకివేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎక్ దిన్ ఎక్ గంటా ఎక్ సాత్ నియమాన్ని పాటిస్తూ ప్రతి నెల ఒకటవ తేదిన ఒక రోజు ఒక గంట అందరం కలిసి గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరస్వతి, హర్యనాయక్, శంకర్, లచ్చు, వినోద్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు క్రిష్ణవేణి విద్యార్థులు

ప్రజాపక్షం/రామన్నపేట : రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 28,29 తేదీలలో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలలో పాల్గొని అండర్14, విభాగంలో ఎస్.ప్రణీత, వి.మానస, ఎం.శరణ్య, పి.అమరనాథ్, అండర్ 17 విభాగంలో పి.నిషిత, ఎస్. అక్షిత, పి.నితిన్ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, పిఈటి కల్పనను ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జెవిఎన్‌ఎస్ మణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.




## వయోవృద్ధుల అనుభవాలు నేటి తరానికి మార్గదర్శకం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : సమాజ నిర్మాణంలో, కుటుంబాల ఎదుగుదలలో వృద్ధుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. వయసు పైబడిన వారిని భారంగా భావించకుండా, వారి అనుభవాలను నేటి తరం మార్గదర్శకంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నంద్యాల ప్రేమ్ కరణ్ రెడ్డి పిలుపునిచ్చారు.అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను మహిళా,శిశు,వికలాంగుల,వయోవృద్ధుల శాఖ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, వృద్ధుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లిదండ్రుల మరియు సీనియర్ సిటిజన్ల పోషణ, సంరక్షణ చట్టం2007 పై చైతన్యం అవసరమని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం కోర్టులో ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డిఏ పీడీ వై.శేఖర్ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి లావణ్య కుమారి,అదనపు పీడీ శశి కుమార్,పర్యవేక్షకులు నాగరాజు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల మల్లికార్జున్, సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్లలో ఎస్‌సి,ఎస్‌టి,బీసీలకు అన్యాయం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి,ఎస్‌టి,బీసీ వర్గాలకు అన్యాయం చేసిందనిమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు ఆరోపించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు సీట్లను రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు కేటాయించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.గురువారం జిల్లా కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఇటీవల తెలంగాణలోని రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ నియోజకవర్గానికి సామ రామ్మోహన్‌రెడ్డి, నల్లగొండఖమ్మంవరంగల్ నియోజకవర్గానికి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించిందన్నారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంజి మాదిగ,గిరి మాదిగ, యాదయ్య, విద్యార్థి నాయకులు శివ,సురేష్,రంగనాథ్,హేమంత్,కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల ప్రాణ రక్షణకే కాటమయ్య కిట్టు

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : గీత కార్మికుల ప్రాణ రక్షణకే కాటమయ్య కిట్లని బిసి సంక్షేమ శాఖ అధికారి గంట వెంకటేశం, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ చింతమల్ల ప్రవీణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సత్య గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బిసి సంక్షేమ, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా గీత కార్మికులకు కాటమయ్య కిట్టుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని తంగెళ్లగూడెం, అనాజీపురం, భక్తళాపురం, అన్నారం గ్రామాలకు చెందిన గీత కార్మికులు ఈ శిక్షణకు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతుల్లో చెట్లు ఎక్కుతున్నప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకే ప్రభుత్వం ఈ కిట్లను తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం కిట్లను



ఎలా ధరించాలి, చెట్టు ఎలా ఎక్కాలి అనే దానిపై కార్మికులకు ప్రత్యేక ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ కానిస్టేబుల్ వసంత, గౌడ సంఘం నాయకులు మద్ది అంజిబాబు, గునగంటి కృష్ణ, జెర్రిపోతుల కృష్ణ, వెంకన్న, అబ్బగాని కాశయ్య, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## లైబ్రరీలు విద్యార్థుల జ్ఞాన భాండాగారాలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : లైబ్రరీలు విద్యార్థుల జ్ఞాన భాండాగారాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కె. అనూష, రవితేజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం సుమారు రూ.5లక్షల విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రటరీ బి. రామచంద్రనాయక్, ఎం. రంగారావు, నిర్మల, సృజన, భవాని పాల్గొన్నారు.



## సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయం

ప్రజాపక్షం/ అడ్డగూడూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మండల బీఆర్‌ఎస్ నాయకులు చౌల్లరామారం గ్రామ వాసి మెట్టు భాస్కర్ రెడ్డి గురువారం రూ.20 వేల నగదును డీటీకి అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా భద్రతతో పాటు కార్యాలయ కార్యకలాపాల పర్యవేక్షణకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కిరణ్ పాల్గొన్నారు.





## అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బుల్లెట్ ట్రైన్ సాధనలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని బిజెపి సీనియర్ నాయకులు కర్నాటి కిషన్ అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన దీక్ష గురువారంతో 49వ రోజుకు చేరింది. ఈ దీక్షకు ఆయన సంఘీభావం తెలపడంతో పాటు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులు బుల్లెట్ సాధన కోసం ఉద్యమిస్తూ ఉంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు వనిత, సట్టు నాగయ్య, భూపతి రాములు గౌడ్, కందుకూరి యాదగిరి, శోభారాణి, రవీందర్ నాయక్, సకినాల కృష్ణ, కరుణాకర్, యాతాకుల మధుసూదన్ పాల్గొన్నారు.

## జల సంరక్షణతోనే భవిష్యత్‌కు భద్రత



ప్రజాపక్షం/కోదాడ: నీటి సంరక్షణపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కోదాడ లోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జల సంరక్షణ, భవిష్యత్ రక్షణ అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జల పరిరక్షణ అవకాశ్యతను చాటిచెప్పారు. కోదాడ మండల విద్యాధికారి ఎండి సలీంషరీఫ్ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వనరని, దాన్ని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సేవ్ వాటర్, సేవ్ లైఫ్, సేవ్ ఫ్యూచర్ నినాదాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తూ నీటి వృధాను అరికట్టాలని, జల వనరులను కాపాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్కండేయ, సమన్వయకర్తలు శ్రీనివాసరావు, బడుగుల సైదులు, ఉపాధ్యాయులు లింగయ్య, వీరబ్రహ్మాచారి, ఎన్‌కె ఖాజామియా, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ప్రజాప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బడుగు, బలహీన వర్గాల వారందరి కోసం అందజేస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని ఐఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో గురువారం హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలోని రేషన్ షాపు వద్ద నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చీకూరి అంజయ్య, అభయ ఆంజనేయస్వామి దేవస్థాన చైర్మన్ వెలిశెట్టి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శానసాల నాగ సైదయ్య పాల్గొన్నారు.

## శ్రమదానం

ప్రజాపక్షం/రామన్నపేట : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం'ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్'కార్యక్రమం శోభనాద్రిపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామసర్పంచ్ కంచి మధుసూదన్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి పవన్ కుమార్,వార్డు సభ్యులు ముక్కాముల సతీష్, చిత్రకంటి సునీత, జంగిలి రమణ,కంచి కుమారస్వామి, కంచి స్వామి, గంగాదారి పద్మ గ్రామ పెద్దలు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## 22ఏ భూములపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/గుండాల;** 22ఏ భూములపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సిపిఐ గుండాల మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సాదా బైనమాల ద్వారా ఖరీదు చేసి ఖాస్తూ, కబ్జాలో ఉన్న రైతులకు నేటికి హక్కులు పొందలేక పోతున్నారని, 22ఏ కింద జరిగిన అవకతవకలు అన్నింటిని సరిదిద్ది రైతులకు లబ్ధిచేకూరే విధంగా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకొని కింది స్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. అసైన్మెంట్ ప్రభుత్వ భూముల విషయంలో కొన్ని చోట్ల కొందరికే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అందరికి వర్తించే విధంగా విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు.

## బిజెపి దివ్యాంగుల విభాగం జిల్లా కో-కన్వీనర్‌గా ముంత మల్లేష్

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం కందుకూరు గ్రామానికి చెందిన ముంత మల్లేష్ యాదవ్‌ను దివ్యాంగుల విభాగం జిల్లా కో కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులను బిజెపి దివ్యాంగుల జిల్లా కన్వీనర్ రాపోలు సంతోష్, దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గోలి ప్రభాకర్‌లు గురువారం ముంత మల్లేష్‌కు నియామక ఉత్తర్వులను అందజేశారు. ముంత మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన రాపోలు సంతోష్, గోలి ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు పాపిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని చందుపట్ల గ్రామంలో బోనాల పండుగ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది ఈ సందర్భంగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య,టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్,ఉద్దీపన వైస్ చైర్మన్ వేముల పుష్ప,పిఎసిఎస్ చైర్మన్ నాగులంచవెంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త మేడవరపు అశోక్ రావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదగోని కొండయ్య,మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య వేరువేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి, సర్పంచ్ లతా వెంకటాచారి,ఉపసర్పంచ్ మంజుల పాల్గొన్నారు.

## విద్యా సదస్సు... ఆత్మీయ సన్మాన కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల;** ఎస్సీ, ఎస్టి ఉపాధ్యాయ సంఘం తెలంగాణ విద్యా సదస్సు , ఆత్మీయ సన్మాన కార్యక్రమం 04/10/2026న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి గుండాల మండలంలోని ఎస్సీ, ఎస్టి ఉపాధ్యాయని, ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయంతం చేయాలని గుండాల మండల ఎస్సీ, ఎస్టి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బోట్ల అనిల్ కుమార్, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దారా శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి యాదగిరిలు పిలుపునిచ్చారు.

## ప్రచార ఆర్భాటం.. ప్రజలకు ఒరిగిందేమీ లేదు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. ప్రజాధనం ఖర్చు చేసినా ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలేవీ ప్రకటించలేదన్నారు. ఎన్నికల హామీలైన రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు రూ.15 వేల సాయం,మహిళలకు రూ.2,500 మహాలక్ష్మి పథకం అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.నకిరేకల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నేతలను విమర్శించడానికే సీఎం ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత, శ్రామికుల శ్రమను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు.కేటీఆర్ పర్యటనకు భయపడే ప్రభుత్వ యంత్రాంగాన్ని ముందుగానే రంగంలోకి దించారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈసమావేశంలో కడపర్తి సర్పంచి గొర్ల వీరయ్య,నాయకులు రాచకొండ వెంకన్న,పేర్ల కృష్ణకాంత్,పల్లె విజయ్,దైదా పరమేశం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కోతలు లేకుండా నాణ్యమైన కరెంట్ అందించాలి



**ప్రజాపక్షం/నాంపల్లి :** రైతే రాజు అని కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు 24 గంటల కరెంట్ అందించి రైతును రాజును చేస్తే,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 5,6 గంటల కరెంట్ ఇచ్చి రైతులను ఇబ్బంది పెడుతోందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. గురువారం విద్యుత్ కోతలు,తక్కువ వోల్టేజీతో కష్టాలు పడుతున్న రైతాంగానికి మద్దతుగా మండల సబ్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నరసింహారావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో పాల్గొని ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాము రైతు పక్షపాత ప్రభుత్వమని చెప్పి వ్యవసాయానికి సరిపడా కరెంట్ ఇవ్వకుండా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు.రైతులకు నిరంతర కరెంట్ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, శ్రీశైలం నుండి 100 కి.మీ. దూరంలో ఉన్న మన ప్రాంతానికి సాగునీరు ఇవ్వకుండా,600 కి.మీ.దూరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కుప్పం నియోజకవర్గానికి నీళ్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, జిల్లా నాయకులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,పూదరి సైదులు,ఇట్టెం వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రాడ్యూయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నుండే రేవంత్‌రెడ్డి పతనం



**ప్రజాపక్షం/దేవరకొండ;** రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో మోసపోని వర్గం లేదని దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. గురువారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ గ్రాడ్యూయేట్ ఎంఎల్‌సి ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో రవీంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగులు, రైతులు, వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యూయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు అత్యంత కీలకమని రవీంద్రకుమార్ అన్నారు. ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త తమ పరిధిలోని పట్టభద్రులను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈఎన్నికలతోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనం ప్రారంభమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని రవీంద్రకుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రాప్ బుకింగ్స్ తో రైతులకు బహుళ ప్రయోజనాలు..

**దాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు చెక్**



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండల వ్యాప్తంగా అన్ని పిఎసిఎస్ ఐకేపి సెంటర్లలో దాన్యం అమ్ముకునే రైతులకు ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు భూమి ఉన్న ప్రతీ రైతు తప్పకుండా క్రాప్ బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయశాఖ ఆదేశించినట్లు ఏవో శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.దీని ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు.ఈ మేరకు పోచంపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘంలో చైర్మన్ పాక మల్లేష్ యాదవ్ అధ్యక్షతన డైరెక్టర్ లతో సమావేశం ఏర్పాటు చేశారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వ్యవసాయ విస్తరణ అధికారి భూ సర్వే చేపడుతారని వివరించారు.యాప్ ద్వారా రైతులందరు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.పంట వివరాలతో పాటు సాగు విస్తీర్ణం సర్వే ,ధాన్యం వివరాలు నమోదు అవుతాయని తెలిపారు.దాన్యం కొనుగోళ్లు కూడా వెంటనే ప్రారంభిస్తామని చెప్పారు. డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ లకు ఈసారి దాన్యం నిల్వలకు అవకాశం లేదని ప్రభుత్వం కొత్త గోదాములను సూచిస్తుందని చెప్పారు.పంట వేసిన రైతులు క్రాప్ బుకింగ్ చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని సూచనలు తప్పక పాటించాలని కోరారు.పంట నష్టం జరిగినప్పుడు రైతులకు పరిహారం చెల్లించేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందన్నారు.ఈ సమావేవంలో వైస్ చైర్మన్ కొట్టం కరుణాకర్ రెడ్డి సిఈవో బాల్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



## జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.రైతులకు ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశాలు,సూత్రాలు,ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకుని తక్కువ పెట్టుబడితో,పర్యావరణహితంగా,స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బండారు శివ,నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్,వార్డు సభ్యులు,వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాంసాహార విక్రయ దుకాణాలు మూసివేత

**ప్రజాపక్షం/దేవరకొండ;** మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 02న దేవరకొండ పురపాలక సంఘం పరిధిలోని చికెన్, మటన్, చేపలు, ఇతర మంసాహార విక్రయ దుకాణాల యజమానులు జీవ హింస నివారణ, అహింసా సుత్రాల పాటింపు దృష్ట్యా మున్సిపల్ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని చికెన్, మటన్, చేపలు ఇతర మాంసాహార విక్రయ దుకాణాలు తప్పనిసరిగా మూసివేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి ఆదేశించారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పదివేల రూపాయల జరిమానా విధించబడుతుందని సంబంధిత మున్సిపల్ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ఘనంగా సెయింట్ థెరీసా పండుగ



**ప్రజాపక్షం/నందికొండ :** మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో ఉన్న సెయింట్ థెరీసా చర్చిలో గురువారం సెయింట్ థెరీసా పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి మల్లేపల్లి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.నల్లగొండకు చెందిన ఫాదర్ జోసఫ్ ప్రత్యేకంగా పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. స్థానిక పారిష్ ప్రీస్ట్ రెవరెండ్ ఫాదర్ మధుబాబు ఆధ్వర్యంలో పండుగ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫాదర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఆమె చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి, సోదరభావంతో జీవించాలని సూచించారు.

## శ్రమదానంతో పరిశుభ్రతకు బాటలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శ్రమదానంతో పరిశుభ్రతకు బాటలు వేయవచ్చని మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజల బాధ్యతన్నారు. కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, ఇంచార్జి శానటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేయడం జరిగిందిని, ఆ విభాగంలో తుర్కపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి గుంటి ప్రణతి, జూనియర్ విభాగంలో బానోత్ శివరాజ్ ఎంపిక కావడం జరిగిందని, ప్రిన్సిపల్ అంబటి శోభారాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 2 తేదీ నుండి 5 వ తేదీలలో వేములవాడలోని ఇండోర్ స్టేడియంలో ఫిజికల్ డైరెక్టర్ పల్లె రమేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ బాలికల సబ్ జూనియర్, జూనియర్ బాలురు పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## పోషకాహారమే తీసుకోవాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** గర్భిణి,బాలింతలు నిపుణులు సూచించిన పోషకాహారమే తీసుకోవాలని అప్పుడే పుట్టిన బిడ్డ తల్లి ఆరోగ్యంగా ఉంటారని ఎండివో విజయ తెలిపారు.గురువారం పోచంపల్లి మండలం మెహర్ నగర్ లో గర్భిణుల సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొని తగు సూచనలు చేశారు.అంగన్వాడి కేంద్రాలలో అందిస్తున్న పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్త బూరుగు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి డా.రుచిరారెడ్డి అధ్వర్యంలో గురువారం మండల స్థాయి గ్రామపంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించి అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ సత్యనారాయణ, హెచ్.వి.దయామణి, ఆరోగ్య సిబ్బంది జానీపాష, సునీల్ కుమార్ సంధ్యారాణి, సుహాసిని, భాగ్యలక్ష్మి, ఫార్మాసిస్టు సిద్ధేశ్వర్, స్టాఫ్ నర్సు సంతోష, ఓ.ఎస్.నజీర్. ఆశాకార్యకర్త వరలక్ష్మి పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక





**ప్రజాపక్షం/రామన్నపేట** : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలకు రామన్నపేట మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ కు చెందిన 8వ తరగతి విద్యార్థి మాస్టర్ తాడూరి ఉమేష్ నంద,8వ తరగతి విద్యార్థిని నోముల కృతిక జిల్లా స్థాయి కబడ్డీ ఆటకు ఎంపికయ్యారు. విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్ది ,వారి విజయానికి కారణమైన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కృషిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. జిల్లా స్థాయి పోటీల్లోనూ వీరు రాణించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు, పి.ఇ.టికి పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్,ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు.

## సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/యాదాద్రి** : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ మంత్ అక్టోబర్ సందర్భంగా భువనగిరి పట్టణంలో గురువారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో భాగంగా ఫ్లాష్ వాక్ మరియు ప్రజా ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎస్పి రవీందర్ నాయకత్వం వహించగా, భువనగిరి టౌన్ సిఐ రమేష్, రూరల్ సిఐ చంద్రబాబు, ఎస్ఐలు అనిల్, లక్ష్మి నరసయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒటిపి, పిన్, సివివి, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్వర్డ్లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్లు, నకిలీ వెబ్సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు కలిసి సైబర్ నేరాల నివారణ, వ్యక్తిగత సమాచార భద్రత, డిజిటల్ సురక్షిత వినియోగంపై ప్రజా ప్రతిజ్ఞ చేశారు. ఆలోచించి క్లిక్ చేయండి ధృవీకరించి స్పందించండి సురక్షితంగా ఉండండి అనే సందేశంతో సైబర్ భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు.

## 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట** : మండల పరిధిలోని సర్నేనిగూడెం గ్రామపంచాయతీలో 'స్వచ్ఛతా హి సేవా'కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై శ్రమదానంలో పాల్గొన్నారు. గ్రామంలో పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ పథకాలను సీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచి, పంపిణీ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.రాములు, ఏపీవో ఎండి రఫీ, గ్రామ సర్పంచ్ గంగాదేవి స్వామి, ఉపసర్పంచ్ ఉపేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లింగస్వామి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నాబార్డ్ సంస్థ సహకారంతో కోళ్ల పంపిణీ



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని చిన్న లక్ష్మాపూర్ గ్రామంలో నాబార్డ్ సంస్థ ఆర్థిక సహకారంతో చిన్నలక్ష్మాపూర్, పొట్టిమర్రి తండాకు చెందిన 21 మంది లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి కోళ్లను పంపిణీ చేశారు. వాటర్షెడ్ కమిటీ ఆధ్వర్యంలో మారీ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి భాస్కర్రెడ్డి మాట్లాడుతూ వాటర్షెడ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కోళ్ల పెంపకం ద్వారా లబ్ధిదారులకు అదనపు ఆదాయం పొందడంతో పాటు, తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చునని, కోళ్ల పెంపకానికి అనువుగా నైట్ షెల్టర్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్షెడ్ కమిటీ అధ్యక్షులు దూబల నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు దూబల రామ్ రెడ్డి, మేడిపల్లి రాజు, మహేందర్ రెడ్డి, గోపనబోయిన ఐలమ్మ, కొముర‌య్య, నరిగె లక్ష్మి, బాలమ్మ, రమావత్ సరిత, దిరావత్ జగన్, మూడవత్ చిన్నా, వార్డు సభ్యులు నరేష్ పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సందర్శించిన డీడబ్ల్యూఓ



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట ప్రాజెక్ట్ కార్యాలయాన్ని గురువారం జిల్లా సంక్షేమ అధికారి చిలుకూరి శ్రీనివాస్ సందర్శించారు. పర్యటనలో భాగంగా ప్రాజెక్ట్ పరిధిలోని రిక్రూట్మెంట్కు సంబంధించిన దరఖాస్తును ఆయన పరిశీలించారు. అనంతరం సూపర్వైజర్లతో ప్రత్యేకంగా రివ్యూ మీటింగ్ నిర్వహించి,క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ,అంగన్వాడీ కేంద్రాల పనితీరు,పోషకాహార పంపిణీ , ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరిస్తూ,ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వెంకటరమణ,ఏసిడిపిఓ పారిజాత,జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్,వివిధ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన తోటకూరి నర్సింహ, చంద్రగిరి మత్స్యగిరి, పోలేబోయిన గంగయ్య, ఎలగందుల సుదర్శన్ లు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందగా చికిత్స నిమిత్తం వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి తోటకూరి నర్సింహ రూ.24 వేలు, చంద్రగిరి మత్స్యగిరి రూ.60,000, పోలేబోయిన గంగయ్య రూ.26,000, ఎలగందుల సుదర్శన్ రూ.37 వేలు మంజూరైన చెక్కులను గురువారం స్థానిక సర్పంచ్ ఏర్పుల వెంకటేశం చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్, వార్డు సభ్యులు కాడిగళ్ల రామనర్సింహ, ఏర్పుల పద్మ యాదయ్య, నాయకులు షేక్ రసూల్, పులిపలుపుల రాములు పాల్గొన్నారు.

## విష కాలుష్యకారక ఫార్మా రసాయన కంపెనీలను మూసివేయాలని పాదయాత్ర



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం దోతిగూడెం అంతమ్మగూడెం గ్రామాలలోని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విష కాలుష్య కారక ఫార్మారసాయన కంపనీలనను ప్రభుత్వం వెంటనే మూపివేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆపార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డివో ఆఫీస్ వరకు బాధిత గ్రామ ప్రజలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. కెమికల్ పరిశ్రమలు నడుపుతున్న గ్రామాలతో పాటుగా చుట్టుప్రక్కల సమీప గ్రామాలలోని ప్రాణాంతక కాలుష్యం వల్ల అనేక దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాధితుల పక్షాన పోరాటాలు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు.

## కౌన్సిలర్ రాజేందర్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : జిల్లా కేంద్రం 32వ వార్డు కౌన్సిలర్ కుంభం రాజేందర్ అనారోగ్యానికి గురికాగా గురువారం తెలంగాణ టూరిజం అభివృద్ధి కమిటి మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, కౌన్సిలర్ షేక్ జహీర్, నాయకులు గట్టు శ్రీనివాస్, పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్, రాజేష్ ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం



**ప్రజాపక్షం/అర్వపల్లి** : గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాల పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, వైద్యులు నజీర్ పాల్గొన్నారు.

# నేరేడుగొమ్ము అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము:** నేరేడుగొమ్ము మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ఎంఎల్ఏ బాలునాయక్ పాల్గొని విబిజి రాంజీ నిధుల నుండి మంజూరు అయిన రూ. 10లక్షలతో సిసి రోడ్డు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ. 10లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి పనులకు ఎంఎల్ఏ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొని నేరేడుగొమ్ము, పందిరిగుండు తండా, జోదుబావితండా, చర్లతండా గ్రామాలకు నూతనంగా ఎన్నికైన గ్రామశాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎంఎల్ఏ బాలునాయక్ అభినందించారు. నేరేడు గొమ్ము మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు బొమ్ము నోని లింగయ్య, సీనియర్ నాయకులు బైకాని సాలయ్యలు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

630 సర్వే నెంబర్ రైతులకు న్యాయం చేస్తాం.....

మండల పరిధిలోని 630 సర్వే నెంబర్‌లో భూములు కలిగి ఉన్న రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను ఎంఎల్ఏ ప్రస్తావిస్తూ ప్రభుత్వ నిబంధనలు, విధానాలకు అను గుణంగా అర్హత కలిగిన రైతులకు పట్టాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. పెండ్లి పాకుల రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన 630 సర్వే నెంబర్ రైతులకు నష్టపరిహారం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం నేరేడుగొమ్ము మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధికా రులతో ఎంఎల్ఏ బాలునాయక్ సమీక్ష నిర్వహించి మండలానికి సంబంధించిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో చర్చించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వెంకటయ్యగౌడ్, మండల అధ్యక్షులు బిక్కు, జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ సుధాకర్, యుగందర్, పాపానాయక్, యాదయ్యగౌడ్, వెంకటయ్య, సురేందర్ పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో సర్పంచ్‌కు సమాచారం కరువు

### ఆర్‌డిఓకు ఫిర్యాదు..బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాపక్షం/చండూరు:** మండలంలోని గుండ్రపల్లి గ్రామపంచా యతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్,పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వ కుండా నిర్వహించడంపై వివాదం నెలకొంది.ఈవ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుండ్రపల్లి సర్పంచ్ ఉజ్జిని ఉష అనిల్‌రావు గురువారం చండూరు ఆర్‌డిఓ వందనపు శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి తనకు,ఉపస ర్పంచ్‌కు,పాలకవర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా,పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారు లపై ఉందని సర్పంచ్ పేర్కొన్నారు.భవిష్యత్తులో గ్రామంలో నిర్వ హించే ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామపంచాయతీ పాలకవర్గానికి ముందస్తు సమాచారం అందించి,సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**ఆర్‌డిఓతక్షణ స్పందన:** సర్పంచ్ ఫిర్యాదుపై చండూరు ఆర్‌డిఓ వందనపు శ్రీదేవి తక్షణమే స్పందించారు.ఈ వ్యవహారంపై జీపీ ఓకు మెమో జారీ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మ రబోయిన వెంకన్న,గుండ్రపల్లి సర్పంచ్ ఉజ్జిని ఉష, రాష్ట్ర నాయ కుడు ఎత్తపు మధుసూదన్‌రావు,మండల ఉపాధ్యక్షుడు కూరపాటి సుదర్శన్,బొడ్డు సతీష్‌గౌడ్,ఉజ్జిని అనిల్‌రావు,అనపర్తి శేఖర్, గాలెంక రాంబాబు, వినోద్‌రెడ్డి,పెండ్యాల నిర్మల్‌రావు,తీగల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే దామోదర్ రెడ్డి ఆశయం





**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డితో తనకున్న నలభై ఏండ్ల అనుబంధం మరువలేనిదని ఆయన అడు గుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాల యంలో దామోదర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ దామన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపా డుకున్నాడని, ఏ కష్టం వచ్చినా ముందుండి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దివంగత నాయ కులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జన రల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, నాయకులు పోతు భాస్కర్, మొరిశెట్టి లక్ష్మాది, డాక్టర్ పూర రామ్మూర్తి యాదవ్, బైరు వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

**అన్న వితరణ...** దివంగత నాయకులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, నాయకులు పోతు భాస్కర్, మొరిశెట్టి లక్ష్మాది హాజరై ప్రజలకు అన్న వితరణ చేశారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజా సేవకు ప్రతి రూపం మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామో దర్ రెడ్డి (ఆర్‌డిఆర్) అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా కౌన్సిలర్ కుమ్మరికుంట్ల వేణుగో పాల్ ఆధ్వర్యంలో వాణిజ్య భవన్ సెంటర్‌లో నిర్వ హించిన అల్పాహార పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ పదవుల్లో ఉన్నా లేకున్నా నిత్యం తన తండ్రి దామోదర్ రెడ్డి ప్రజల మధ్యనే ఉన్నారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్య క్షులు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, నాయకులు పోతు భాస్కర్, మొరిశెట్టి లక్ష్మాది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నూతనకల్ :** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్ధంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు నాగం సుధాకర్ రెడ్డి, సర్పంచులు గుగులోతు కృష్ణ నాయక్, పాండవుల లింగన్న, జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్, భూరెడ్డి సంజీవ రెడ్డి, దరిపల్లి వీరన్న, ఇమ్మారెడ్డి మల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, ఉప్పల పాపయ్య, నకిరేకంటి మధు, బంటు బద్రి పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులో ఉన్న ఇందిర ఆనాధ వృద్ధాశ్రమంలో నర్సింహాపురం సర్పంచ్ వేమూరి సత్యనారాయణ మాతృమూర్తి సుగు ణమ్మ 4వ వర్ధంతి సందర్భంగా గురువారం వృద్ధు లకు అన్నదానం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ తన మాతృమూర్తి వర్ధంతి, అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆనాధలకు, వృద్ధులకు అన్నదానం చేయడం చాల సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో ముదుంబై సీతారామను జచార్యులు, బుద్ధిసాయి, ఆశ్రమంనిర్వాహకు రాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/డిండి;** గుర్తు తెలియని..మతిస్థిమితం లేని వ్యక్తి వయస్సు(65) గత నెల రోజులుగా డిండి గ్రామంలోని సాయిబాబా ఆలయం మరియు బేకరి దగ్గర అడుకుంటూ ఉన్న వ్యక్తి గురువారం ఉదయం 6 గంటలకు విద్యాసాగర్ రెడ్డి వైన్స్ వద్ద చనిపోయి ఉండగా అతనిని గమ నించగా ఆరోగ్యం బాగాలేక చనిపోయినట్లుగా నిర్ధారించారు. ఎవరైనా అతన్ని గుర్తు పడితే డిండి పోలీసులను సంప్రదించాలని, మృతదేహాన్ని దేవ రకొండ మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ బాల కృష్ణ తెలిపారు.

## ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తం

### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నల్లగొండ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, ఆన్‌లైన్ లావాదే వీల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగు తున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను వివిధ రకాలుగా మోసం చేసి బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత వివరాలు, డబ్బును కాజే స్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సైబర్ మోసాల కారణంగా ప్రతి సంవత్సరం సుమారు రూ.1,800 కోట్ల మేర నష్టం జరుగుతోందని తెలిపారు.విద్యార్థులు, యువత సైబర్ భద్రతపై అవగాహన పెం పొందించుకొని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తు లకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.సైబర్ నేరాల నియం త్రణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,ఎస్‌బీ సీఐ నాగరాజు,టూ టౌన్ సీఐ ఆది రెడ్డి,ఎస్ఐ సైదా బాబు,ఎస్ఆర్ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ దోనాల శ్రీనివాస్ రెడ్డిఅధికారులు,సిబ్బంది,ప్రభుత్వ డిగ్రీ కళాశాల,జూనియర్ కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు,యువత పాల్గొన్నారు.

